# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**ఆగస్టు 19, 2011**

## మావోయిస్టు విప్లవోద్యమ నాయకత్వంపై దోపిడీ పాలకవర్గాలు, కార్పొరేట్ మీడియా సాగిస్తున్న విషపూరిత దుష్ప్రచారాన్ని చెత్తకుప్పపైకి విసరెయ్యండి!

నేడు భారత విప్లవోద్యమం కఠిన సవాళ్లను ఎదుర్కొంటూ గెలుపు–ఓటమి–గెలుపు మార్గంలో పురోగమిస్తున్నది. ఈ విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో దోపిడీ పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల పూర్తి అండదండలతో క్రూరమైన అణచివేత యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదులు రూపొందించిన ఎల్ఐసీ (తక్కువ తీవ్రత గల ఘర్షణ) వ్యూహాన్ని అనుసరిస్తూ ఈ ఫాసిస్టులు ప్రతిఘాతుక యుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. ప్రత్యేకించి 2009 నుండి యూపీఏ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో దేశవ్యాప్తంగా అణచివేత యుద్ధాన్ని కొనసాగిస్తున్నది. సోనియా–మన్‌మోహన్‌సింగ్–చిదంబరం–ప్రణబ్ ముఖర్జీల ముఠా నాయకత్వంలో దేశ ప్రజలపై కొనసాగుతున్న ఈ అన్యాయమైన యుద్ధంలో 'అణచివేత–అభివృద్ధి'ని (ప్రజల అణచివేత, కార్పొరేట్ సంస్థల అభివృద్ధి అని చదువుకోవాలి) తమ వ్యూహంగా చెబుతున్నారు. ఇందులో భాగంగా విప్లవోద్యమ నాయకత్వానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం కీలక అంశంగా సాగే మానసిక యుద్ధాన్ని ఒక వ్యూహాత్మక అస్త్రంగానే వుపయోగిస్తున్నారు. ఈ మానసిక యుద్ధానికి ఒక ముఖ్యమైన వాహికగా మీడియాను వుపయోగించుకుంటున్నారు. కార్పొరేట్ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే మీడియా ప్రతినిధులు, దోపిడీవర్గాల భావజాలాన్ని సమర్థించే కుహనా మేధావులు మావోయిస్టు వుద్యమంపై బురద జల్లే క్యాంపెయిన్‌ను కొనసాగిస్తూ శత్రు మానసిక యుద్ధంలో చురుగ్గా పాలు పంచుకుంటున్నారు.

విప్లవోద్యమానికి ఎంత చరిత్ర వుందో విప్లవ వ్యతిరేక దుష్ప్రచారానికీ అంతే చరిత్ర వుంది. ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే అది నిజమై తీరుతుందని చెప్పిన జర్మన్ ఫాసిస్టు ప్రచార మంత్రి గోబెల్స్‌కు సిసలైన ఇండియన్ అవతార్స్‌గా ముందుకు వచ్చిన సోనియా, మన్మోహన్ సింగ్, చిదంబరం, ప్రణబ్ ముఖర్జీ, రమన్‌సింగ్, నవీన్ పట్నాయక్, నితీష్ కుమార్, కిరణ్‌కుమార్ తదితర పాలకులు, వాళ్ల వంతగాళ్లయిన అర్నాబ్ గోస్వామి, చందన్ మిత్రా తదితరులు మీడియాలో వివిధ రూపాల్లో దుష్ప్రచార క్యాంపెయిన్ నడుపుతున్నారు. విప్లవ సిద్ధాంతమైన మార్క్సిజానికి కాలం చెల్లిందనే ప్రచారం మొదలుకొని మావోయిస్టు నేతల మధ్య తీవ్ర విభేదాలున్నాయనే దాకా విప్లవోద్యమ నాయకత్వానికి, నాయకత్వ సంస్థలకు వ్యతిరేకంగా అభూత కల్పనలతో, అసత్యాలతో, అర్ధసత్యాలతో వార్తల్ని ప్రతిరోజూ ప్రచురిస్తున్నారు, ప్రసారం చేస్తున్నారు. విప్లవ సిద్ధాంతంపై, విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్న మా పార్టీపై, పార్టీ నాయకత్వంపై అపోహల్ని, అనుమానాల్ని, భ్రమల్ని సృష్టించి ప్రజలను, విప్లవ శ్రేణుల్ని గందరగోళపర్చడం, నిరాశను, అవిశ్వాసాన్ని వ్యాపింపజెయ్యడం ఈ దుష్ప్రచార క్యాంపెయిన్ ఏకైక లక్ష్యం. ఇలా ప్రజల్ని మోసపుచ్చి తమ దోపిడీ వర్గ పాలనను నిరాటంకంగా కొనసాగించగలమని, సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాలను అడ్డూఆపూ లేకుండా అమలు చేయగలమని దోపిడీపాలకులు, వాళ్లకు వంతపాడే కుహనా మేధావులు కల గంటున్నారు. ఈ కోవలోకి వచ్చే కొందరు జర్నలిస్టులు ఇంటలిజెన్స్ అధికారులతో కుమ్మక్కయ్యి, కార్పొరేట్ మీడియా సంస్థల ద్వారా మావోయిస్టు విప్లవోద్యమంపై బురదజల్లే చెత్తను ప్రసారం, ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగమే 2011 జూలై 17న 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికలో 'బిట్టర్ డిఫరెన్సెస్ క్రాప్ అప్ బిట్వీన్ మావోయిస్ట్ పీడబ్ల్యూ అండ్ ఎంసీసీ ఫాక్షన్స్' అనే పేరుతో ప్రచురితమైన వికృత కట్టుకథ.

దేశ ఇంటలిజెన్స్ సంస్థలు రూపొందించిన, రాఖీ చక్రవర్తి రాసిన ఈ కట్టుకథలో మావోయిస్టు పార్టీ నాయకత్వాన్ని వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే గాకుండా పార్టీలో పీడబ్ల్యూ, ఎంసీసీ ఫ్యాక్షన్లను కృత్రిమంగా పుట్టించి, వాటి మధ్య తీవ్ర విభేదాలున్నట్టు రాశారు. దేశ పీడిత ప్రజల, ప్రపంచవ్యాప్త విప్లవ శ్రేణుల చిరకాల ఆకాంక్షల ఫలితంగా, ఎన్నో సుసంపన్నమైన అనుభవాలతో, చీకటి అధ్యాయంగా పేర్కొన్న ఒక అత్యంత బాధాకరమైన పీరియడ్‌ను అధిగమించి సాధించిన రెండు విప్లవ పార్టీల ఐక్యత మన దేశ విప్లవోద్యమ చరిత్రలోనే ఒక మహోజ్వల ఘట్టం. కేవలం నిజమైన, నిస్వార్థపరులైన విప్లవకారులు మాత్రమే ఇలా బహిరంగంగా తమ తప్పుల్ని అంగీకరించి, ప్రజలను క్షమాపణలు కోరుతారు. వాటిని పునరావృతం కానివ్వకుండా దృఢ సంకల్పంతో పని చేస్తారు. అందుకే ఈ నిజమైన ఐక్యతతో దేశంలోనూ, ప్రపంచంలోనూ పీడిత ప్రజానీకం, విప్లవ శ్రేణులు ఎంతగా ఉత్సాహపడ్డాయో భారత దోపిడీ పాలకవర్గాలు, వాళ్ల

యజమానులైన సామ్రాజ్యవాదులు అంతగా కలవరపడ్డారు. భయభ్రాంతులయ్యారు. సామ్రాజ్యవాదుల నమ్మిన బంటు, దేశ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మావోయిస్టు వుద్యమాన్ని దేశ ఆంతరంగిక భద్రతకు అతి పెద్ద ప్రమాదం అని అభివర్ణించడం మొదలుపెట్టింది ఈ చారిత్రాత్మక ఐక్యత నేపథ్యంలోనే అన్నది గమనార్హం. రెండు పార్టీల మధ్య ఐక్యత పూర్తయిన నాటి నుండి దేశ పాలక ముఠా విప్లవోద్యమంపై ఫాసిస్టు దాడిని మరింత బరితెగింపుతో పెంచింది కూడా ఒక కాదనలేని వాస్తవం.

విప్లవ పార్టీల ఉన్నత నాయకుల మధ్య ఊహాజనిత విభేదాల్ని సృష్టించడమన్నది పాలక వర్గాలు ఎప్పటి నుండో అనుసరిస్తున్న పాత ఎత్తుగడ. విప్లవోద్యమ నాయకుల్లో నెలకొన్న ఇలాంటి కెరీరిజాలతో, వైరుధ్యాలతో ఈ పార్టీలు కూడా తమకు సరిగా నాయకత్వం వహించలేవని ప్రజలు నమ్మేలా చేయడం దీని ఉద్దేశ్యం. ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి వుదాహరణలు ఎన్నయినా చెప్పవచ్చు. టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రచురితమైన ఈ వార్త ఎన్నో దశాబ్దాలుగా ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్న మా నాయకులకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన అత్యంత విషపూరిత దుష్ప్రచారాల్లో ఒకటి. వాళ్లలో కొందరు ప్రస్తుతం జైళ్లల్లో మగ్గుతుండగా రాజ్యం వాళ్లకు ఎలాంటి సదుపాయాలు అందకుండా, వృద్ధాప్యంలో సైతం ఎలాంటి వైద్య సహాయం దొరక్కుండా చేసి అమానవీయంగా వ్యవహరిస్తున్నది. పీడిత ప్రజల విముక్తి కోసం తమ సర్వస్వాన్ని అర్పించిన మా నాయకుల పట్ల రాజ్యం అనుసరిస్తున్న దమననీతి రోజురోజుకూ ఎన్నడూ చూడనంత దారుణ స్థాయికి చేరుతున్నది. ఒక రకంగా చూస్తే, విప్లవ రాజకీయాల ప్రభావం పెరిగిపోతుండడం పట్ల రాజ్యం ఎలా భయపడుతున్నదో, దీన్ని తగ్గించడం కోసం ఎంత నిరర్థకంగా కుయుక్తులు పన్నుతున్నదో దీని ద్వారా అర్థమవుతున్నది. మా నాయకత్వంపై చేస్తున్న ఈ ఆరోపణలన్నిటినీ మా పార్టీ పూర్తిగా తోసిపుచ్చుతున్నది. వీటిలో ఒక్క పదాన్ని కూడా నమ్మవద్దని పీడిత ప్రజలకూ, విప్లవ శిబిరానికీ విజ్ఞప్తి చేస్తున్నది.

నిజమైన విప్లవ పార్టీలన్నిటిలోనూ అనేక అభిప్రాయ భేదాలుంటాయి. వాటి సభ్యులలో సిద్ధాంత, రాజకీయ, నిర్మాణపరమైన, సైనిక, సాంస్కృతిక తదితర విషయాలపై విభిన్న అభిప్రాయాలుంటాయి. విభిన్న భావాలు చర్చకు వస్తాయి. ప్రతి సభ్యుడు/సభ్యురాలు వాటిపై తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చిన తర్వాత మెజారిటీతో అవి తుది రూపం పొందుతాయి. విప్లవ పార్టీలు అనుసరించే ఈ ప్రజాస్వామిక ప్రక్రియను పాలక వర్గ పార్టీలలో ఎన్నడూ చూడలేం. అవి దీన్ని ఎన్నడూ అర్థం చేసుకోలేవు. ఇలాంటి చర్చలు, విమర్శ-ఆత్మవిమర్శల ద్వారానే ఒక విప్లవ పార్టీ తన విప్లవకర స్వభావాన్ని నిలబెట్టుకోగల్గుతుంది తప్ప బూర్జువా పార్టీల మాదిరి ఎవరో ఒక నేతను గుడ్డిగా అనుసరించడం ద్వారా కాదు. వర్గ పోరాట కొలిమిలో రాటుదేలడం ద్వారానూ, పలు విమర్శ-ఆత్మవిమర్శ సెషన్స్‌లో పాలు పంచుకోవడం ద్వారానూ విప్లవకారులు తమను రాటుదేల్చుకుంటారు. ఇంటలిజెన్స్ సంస్థలు పార్టీలో కొనసాగే ఈ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని వక్రీకరించి సరిగ్గా దానికి విరుద్ధంగా చిత్రించడానికి ప్రయత్నిస్తున్నాయి. పార్టీ లోపల, అది కూడా పీడబ్ల్యూ, ఎంసీసీ వర్గాల మధ్య తీవ్రమైన విభేదాలున్నాయని ప్రచారం చేయడం ద్వారా ప్రజలను, శ్రేణులను గందరగోళపర్చడానికి ప్రయత్నిస్తున్నాయి. దీన్ని ముక్తకంఠంతో ఖండించాలనీ, రాజ్యం పన్నే కుట్రల పట్ల అప్రమత్తంగా వుండాలనీ, ఈ దుష్ప్రచారాన్ని పెంటకుప్పపైకి తోసేసి విప్లవోద్యమానికి సంఘీభావంగా దృఢంగా నిలబడాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ దేశ, ప్రపంచ ప్రజానీకానికీ, ప్రజాస్వామికవాదులకూ, విప్లవ శ్రేణులకూ విజ్ఞప్తి చేస్తున్నది.

చివరగా, మా పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గణపతి నిరుడు అక్టోబర్ నెలలో ఇచ్చిన ఇంటర్వ్యూలో పార్టీలో మునుపటి పీడబ్ల్యూ, ఎంసీసీ వాళ్ల మధ్య విభేదాలున్నట్టు జరుగుతున్న దుష్ప్రచారంపై వ్యాఖ్యానిస్తూ మాట్లాడిన విషయం ఈ సందర్భానికి కూడా వర్తిస్తుందని భావిస్తూ మా కేంద్ర కమిటీ ఈ విషయాన్ని మరోసారి నొక్కి చెబుతున్నది.

"...పార్టీలో సరైన భావాలకూ, తప్పుడు భావాలకూ సంఘర్షణ నిరంతరం వుంటుంది. అభిప్రాయభేదాలను కేంద్రీకృత ప్రజాస్వామ్యానికి కట్టుబడి, మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వెలుగులో మేం పరిష్కరించుకుంటాం. అది పార్టీ అభివృద్ధికే దారి తీస్తుంది. విలీనంతో మేం గొప్ప ఐక్యతను సాధించాం. ఇప్పుడు మా పార్టీలో ఏ చర్చలు జరిగినా, ఎన్ని భావ సంఘర్షణలు జరిగినా అవి ఒక ఐక్య పార్టీలో జరిగే రాజకీయ, సైద్ధాంతిక చర్చలుగానే వుంటాయి తప్ప మునుపటి సిపిఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్), మునుపటి ఎంసీసీఐల మధ్య విభేదాలుగా ఎంతమాత్రం వుండవు. విలీనం ముందునాటి ఘర్షణల రూపం ఎన్నటికీ తీసుకోదు అని మేం నిర్ద్వంద్వంగా చెప్తున్నాం."

Abhay

**(అభయ్)**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**